సమగ్ర తెలుగు దినపత్రిక

# అడుగు

The Step Towards The Truth

హైదరాబాద్ | శుక్రవారం 28 ఆగస్టు 2026 | సంపుటి: 02 | సంచిక: 181 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com



## ఖేలో ఇండియా సంవాద్

**దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం**

**క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు**

న్యూఢిల్లీ,ఆగస్ట్27(అడుగు న్యూస్): దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అ÷-లథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం

మిగతా 3లో..



# భయానక వాతావరణం

- **ఎటుచూసినా మృత్యు దిబ్బలే**
- నేపాల్ ను ముంచేసిన ఆకస్మిక వరదలు
- 359మంది మృతి, 910 మంది ఆచూకీ గల్లంతు
- బురదలో కనుమరుగైన పదులసంఖ్యలో గ్రామాలు
- ఏరియల్ ఫుటేజీలో బయటపడుతున్నవిధ్వంసం
- టిబెట్‌లో అదేతరహా విరిగిపడ్డ కొండచరియలు
- ముగ్గురు మృతి, 800 మందికిపైగా మిస్సింగ్!
- ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల గల్లంతు
- విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య
- సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్
- ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు
- 80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు
- **కన్నీటి పర్యంతం అయిన జగ్గీవాసుదేవ్**



ఖాట్మండ్,ఆగస్ట్27(అడుగు న్యూస్): నేపాల్‌లో ఆకస్మిక వరదల్లో మృతిచెందిన వారి సంఖ్య గంటగంటకూ పెరుగుతోంది. మృతుల సంఖ్య 359 దాటినట్లు నేపాల్ పోలీసులు ప్రకటించారు. 910 మంది ఆచూకీ గల్లంతైంది. గల్లంతైన వారిలో 288 మంది భారత పర్యటకులు ఉన్నారు. ఉప్పెనలా వరద, బురద ముంచెత్తడంతో వేలాది ఇళ్లు, పలు వంతెనలు నామరూపాల్లేకుండా పోయాయి. అనేక చోట్ల భారీ ఎత్తున బురద మేట వేసింది. సమాచార వ్యవస్థ దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బుధవారం ఉదయం టిబెట్ సరిహద్దుల్లోని భోటేకోషి నదిలో ఒక్కసారిగా సంభవించిన మెరుపు వరదలు భారీ విధ్వంసాన్ని సృష్టించాయి. వరద ప్రవాహానికి గ్రామాలకు గ్రామాలే కొట్టుకుపోయాయి. వందలాది ఇళ్లు, భవనాలు,

మిగతా 2లో..

## ఒక ముప్పు తప్పకముందే మరో ముప్పు..

### నేపాల్‌లో హై అలర్ట్!

ఖాట్మండు, ఆగస్టు 27 (అడుగు న్యూస్): ఆకస్మిక వరదలతో అతలాకుతలమైన నేపాల్‌లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. వరదల ధాటికి అనేక గ్రామాలు నేలమట్టం కాగా, వందలాది మంది గల్లంతయ్యారు. ఇప్పటివరకు 359 మంది మృతి చెందినట్లు నేపాల్ పోలీసులు వెల్లడించారు. చిత్వాన్ జిల్లాలోనే 132 మృతదేహాలు లభ్యమైనట్లు తెలిపారు. ఇదే సమయంలో నేపాల్-టిబెట్

మిగతా 2లో..

## 'రాఖీ'తో 'రాజీ'...!?

### మంత్రి పదవికి 'రక్షా' బంధన్!

### కొండా సురేఖ వ్యూహం ఫలించేనా?

**'రక్షాబంధనం' సురేఖక్క మంత్రి పదవిని రక్షిస్తుందా? 'రాఖీ'తో 'రాజీ' కుదురుతుందా? మంత్రి కొండా సురేఖ వ్యూహం ఫలిస్తుందా? ఏం కానుంది?**



హైదరాబాద్, ఆగస్టు 27 (అడుగు ప్రత్యేక ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. క్రమశిక్షణా సంఘం నివేదిక పీసీసీకి, అటు నుంచి అధిష్ఠానానికి అందింది. అనేక మంది ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో నష్ట నివారణకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టీని,

మిగతా 2లో..

## మిరాలం చెరువుకు మహర్దశ

### పర్యాటక కేంద్రంగా అభివృద్ధి.. ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం

### పనులను పరిశీలించిన సిఎం రేవంత్



హైదరాబాద్,ఆగస్ట్27(అడుగు న్యూస్): హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు అద్దబోతోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు , వినోదాన్ని ఆస్వాదించేలా దీనిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం మిర్ ఆలం చెరువును అకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ

మిగతా 2లో..

## నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

హైదరాబాద్,ఆగస్ట్27(అడుగు న్యూస్): హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి ఎథిక్స్ కమిటీ నోటీసులు జారీ చేసింది. స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చేసిన వ్యాఖ్యలపై ఆగస్ట్ 29న అసెంబ్లీ కమిటీ హాల్1లో ఉదయం 11 గంటలకు ఎథిక్స్ కమిటీ భేటీ కానున్నది. కౌశిక్ రెడ్డిపై వచ్చిన ఫిర్యాదుపై కమిటీ విచారించనున్నది. కాగా,

మిగతా 2లో..



**తుమ్మిడిహెట్టి ఆనకట్టపై 2 రాష్ట్రాలతో**

# సంప్రదింపులు

### సెప్టెంబర్ 1న సమావేశం ఏర్పాటు చేసిన కేంద్రం

### కేంద్ర జల సంఘం ఛైర్మన్ అధ్యక్షతన భేటీ ఛాన్స్

### పాల్గొననున్న తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నతాధికారులు

హైదరాబాద్,ఆగస్ట్27(అడుగు న్యూస్): ప్రాణహిత నదిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన తుమ్మిడిహెట్టి ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై వచ్చే నెల ఒకటో తేదీన దిల్లీలో కీలక సమావేశం జరగనుంది. కేంద్ర జలసంఘం ఛైర్మన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తెలంగాణ నీటి పారుదల, మహారాష్ట్ర జల వనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. తుమ్మిడిహెట్టి ఆనకట్ట విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మే 26వ తేదీన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు లేఖ రాసి, రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి కూడా ఈ అంశాన్ని సీఎం తీసుకెళ్లారు. ఆ లేఖను ప్రధానమంత్రి కార్యాలయం జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు కూడా ఆగష్టు ఐదో తేదీన లేఖ రాసిన ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు. తుమ్మిడిహెట్టి ఆనకట్టపై రెండు రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలని కేంద్ర జలసంఘం ఛైర్మన్‌కు కేంద్ర జలశక్తి శాఖ ఆదేశించింది. అందుకు అనుగుణంగా సెప్టెంబర్ ఒకటో తేదీన దిల్లీ సేవా భవన్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి మహారాష్ట్రతో గతంలో ఒప్పందం కుదిరింది.

మిగతా 2లో..

## ఆలోచన విరమించుకోండి

**నియోజకవర్గాల సంఖ్య పెంచొద్దు**

**యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు**

**మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి**

**ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు**

**ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ**




న్యూఢిల్లీ,ఆగస్ట్27(అడుగు న్యూస్): లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల

మిగతా 2లో..

## జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

### 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను తెరిచిన ప్రజలు

### వివరాలను వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ




న్యూఢిల్లీ,ఆగస్ట్27(అడుగు న్యూస్): దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ,

మిగతా 2లో..

## హిమాలయాల్లో మహా విలయం!?

ఇంతటి విపత్తు నుంచి భారత్ పాఠాలు నేర్చుకోవాలి. హిమాలయాల్లో విచ్చలవిడిగా రహదారులు, హైడ్రోపవర్ ప్రాజెక్టులు, పర్యాటక నిర్మాణాలు చేపడుతూ పర్వతాల సహజ సమతౌల్యాన్ని దెబ్బతీస్తే ప్రమాదాల సంఖ్యేకాదు, వాటి తీవ్రతా పెరుగుతుంది. వాతావరణ మార్పుతో హిమానీనదాల కరుగుదల, పర్వత వాలుల అస్థిరత, హిమానీ సరస్సుల విస్తరణ వంటి ప్రమాదాలు పెరుగుతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా ఆపడం మనకు సాధ్యం కాకపోవచ్చు. కానీ వాటి నష్టాన్ని తగ్గించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. ఉపగ్రహ నిఘా, నదీ సెన్సర్లు, రియల్‌టైమ్ హెచ్చరికలు, సరిహద్దు దేశాల మధ్య సమాచార భాగస్వామ్యం, ప్రమాద ప్రాంతాల్లో నిర్మాణాలపై కఠిన నియంత్రణ, స్థానిక ప్రజలకు ముందస్తు శిక్షణ ఇవన్నీ ఇక ఐచ్ఛికాలు కావు. భోటే కోషి విలయం ఒక విషాద గాథ మాత్రమే కాదు. హిమాలయాలను ఎలా అభివృద్ధి చేయాలి?, ప్రకృతితో ఎంతమేరకు జోక్యం చేసుకోవాలి? అనే ప్రశ్నలకు ఇచ్చిన ఘోరమైన హెచ్చరిక. ప్రకృతిని జయించాలనే అహంకారానికి బదులు, మానవులు ప్రకృతితో సహజీవనం చేయడం నేర్చుకోవాలి.

**డా. మార్గం-అడుగు**

ఎడిటోరియల్ 2వ పేజీలో

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# సంపాదకీయం
## మార్గం - అడుగు



## హిమాలయాల్లో మహా విలయం!?

నేపాల్‌లోని భోటే కోషి, త్రిశూలి నదీ పరివాహక ప్రాంతాలను ఆగస్టు 26న ముంచెత్తిన ఆకస్మిక వరద హిమాలయాల సున్నితత్వాన్ని మరోసారి ప్రపంచం ముందుంచింది. కొద్ది నిమిషాల్లోనే గ్రామాలు, మార్కెట్లు, రహదారులు, వంతెనలు, వాహనాలు, విద్యుత్ మౌలిక సదుపాయాలు వరద ప్రవాహంలో కలిసిపోయాయి. ఇది సాధారణ వర్షాకాల వరద కాదు. మంచు, రాళ్ల చరియలు, నదీ ప్రవాహం, భౌగోళిక అస్థిరత కలిసి సృష్టించిన ఒక సంక్లిష్ట విపత్తు. ప్రకృతి ప్రకోపం.

మృతులు, గల్లంతైన వారి సంఖ్యపై అధికారిక లెక్కలు గంట గంటకూ పెరుతున్నాయి. ఆగస్టు 27న అందుబాటులో ఉన్న తాజా అంతర్జాతీయ నివేదికల ప్రకారం నేపాల్, టిబెట్ లల్లో కలిపి 359 మందికిపైగా మరణించగా, వెయ్యి మందికి పైగా గల్లంతయ్యారు. నేపాల్‌లోనే వందలాది మంది గల్లంతైనట్లు అధికారులు చెబుతున్నారు. గల్లంతైన వారిలో విదేశీ పర్యాటకులు, యాత్రికులు, స్థానికులు, భద్రతా సిబ్బంది ఉన్నారు. భారత్‌కు చెందిన పలువురు కైలాస మానస సరోవర్ యాత్రికులు కూడా ఆచూకీ లేకుండా పోయారు.

ఈ విపత్తు వెనుక కారణంపై తొలుత భూకంపం, భారీ వర్షం వంటి అనుమానాలు వ్యక్తమయ్యాయి. బుధవారం ఉదయం 8.37 గంటలకు 4.4 తీవ్రతతో ప్రకంపనలు నమోదయ్యాయి. అయితే తర్వాతి విశ్లేషణలు అసలు కారణాన్ని మరింత స్పష్టంచేశాయి. మంచు, రాళ్ల భారీ చరియలు నదీ ప్రవాహాన్ని అడ్డుకోవడం, తాత్కాలిక సరస్సు ఏర్పడటం, ఆ అడ్డంకి ఒక్కసారిగా తెగిపోవడం వల్ల విపరీతమైన నీటి ప్రవాహం కిందికి దూసుకొచ్చినట్లు ప్రాథమిక సాంకేతిక అధ్యయనాలు సూచిస్తున్నాయి. యుఎస్జీఎస్ సహా శాస్త్రీయ సంస్థల పరిశీలనల్లో హిమాలయాల్లోని అస్థిరత కీలక అంశంగా కనిపిస్తోంది.

వరద వేగం ఎంత భయంకరంగా ఉందో గణాంకాలే చెబుతున్నాయి. ఐసీఐఎంఓడీ పరిశీలన ప్రకారం గల్ఛీ వద్ద త్రిశూలి నది నీటిమట్టం కేవలం 30 నిమిషాల్లో 9 మీటర్లు పెరిగింది. మాలేఖు వద్ద అదే సమయంలో నీటిమట్టం 7 మీటర్లు ఎగసింది. ఇలాంటి వేగంతో వచ్చే వరదకు సంప్రదాయ హెచ్చరిక వ్యవస్థలు పనిచేయడానికి సమయం ఉండే అవకాశమే లేదు.

విపత్తు తర్వాతి దృశ్యాలు మరింత విషాదకరం. ఒకప్పుడు ఇళ్లు, దుకాణాలు, మార్కెట్లతో సందడిగా ఉన్న ప్రాంతాలు ఇప్పుడు బురద, రాళ్లు, శిథిలాల కుప్పలుగా మారాయి. రహదారులు, వంతెనలు తెగిపోవడంతో సహాయక బృందాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. నేపాల్ విద్యుత్ రంగానికీ భారీ దెబ్బ తగిలింది. 430 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యానికి సంబంధించిన హైడ్రోపవర్, సోలార్, ప్రసార, పంపిణీ సదుపాయాలు దెబ్బతిన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

ఇక్కడ మరో కీలక ప్రశ్న సమాచార మార్పిడి. టిబెట్ నుంచి నేపాల్‌లోకి ప్రవహించే నదుల విషయంలో సరిహద్దు దాటి వచ్చే ప్రమాదాలపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థ ఎంత బలంగా ఉందన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. అయితే దీనిని కేవలం చైనా వైఫల్యంగా చూడటం కంటే, ఇలాంటి విపత్తులను ఎదుర్కొనే సంస్థాగత, శాస్త్రీయ, అంతర్జాతీయ సమాచార వ్యవస్థల లోపాన్ని పరిశీలించాలి. ఇదే నేపథ్యంలో నేపాల్, చైనా మధ్య వాతావరణ సమాచారాన్ని తక్షణం పంచుకునే ఒప్పందం కుదిరింది.

ఇంతటి విపత్తు నుంచి భారత్ కూడా పాఠాలు నేర్చుకోవాలి. హిమాలయ ప్రాంతాల్లో విచ్చలవిడిగా రహదారులు, హైడ్రోపవర్ ప్రాజెక్టులు, పర్యాటక నిర్మాణాలు చేపడుతూ పర్వతాల సహజ సమతౌల్యాన్ని దెబ్బతీస్తే ప్రమాదాల సంఖ్యేకాదు, వాటి తీవ్రతా పెరుగుతుంది. వాతావరణ మార్పుతో హిమానీనదాల కరుగుదల, పర్వత వాలుల అస్థిరత, హిమానీ సరస్సుల విస్తరణ వంటి ప్రమాదాలు పెరుగుతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా ఆపడం మనకు సాధ్యం కాకపోవచ్చు. కానీ వాటి నష్టాన్ని తగ్గించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. ఉపగ్రహ నిఘా, నదీ సెన్సర్లు, రియల్‌టైమ్ హెచ్చరికలు, సరిహద్దు దేశాల మధ్య సమాచార భాగస్వామ్యం, ప్రమాద ప్రాంతాల్లో నిర్మాణాలపై కఠిన నియంత్రణ, స్థానిక ప్రజలకు ముందస్తు శిక్షణ ఇవన్నీ ఇక ఐచ్ఛికాలు కావు. భోటే కోషి విలయం ఒక విషాద గాథ మాత్రమే కాదు. హిమాలయాలను ఎలా అభివృద్ధి చేయాలి?, ప్రకృతితో ఎంతమేరకు జోక్యం చేసుకోవాలి? అనే ప్రశ్నలకు ఇచ్చిన ఘోరమైన హెచ్చరిక. ప్రకృతిని జయించాలనే అహంకారానికి బదులు, మానవులు ప్రకృతితో సహజీవనం చేయడం నేర్చుకోవాలి.

## ఆలోచన విరమించుకోండి

మొదటిపేజీ తరువాయి..

ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ పక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న అంశాన్ని కాంగ్రెస్ గతంలోనూ ప్రస్తావించింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈ డిమాండ్లను పునరుద్ఘాటించాయి. డీలిమిటేషన్‌కు సంబంధించిన అంశాలతో ముడిపెట్టి మహిళ రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలన్న ప్రధాని విజ్ఞప్తిని కాంగ్రెస్ గతంలో విమర్శించింది. మహిళ రిజర్వేషన్ పేరుతో ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తోందని ఆరోపించింది. 2026 బడ్జెట్ సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఎదురుదెబ్బ తగిలింది. ఏప్రిల్ 17న జరిగిన ఓటింగ్‌లో మొత్తం 528 మంది ఎంపీలు పాల్గొన్నారు. వారిలో 298 మంది బిల్లుకు అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలోని ఓట్లలో మూడింట రెండు వంతుల మద్దతు అవసరం. అంటే 352 ఓట్లు రావాల్సి ఉండగా, అనుకూలంగా 298 ఓట్లు మాత్రమే వచ్చాయి.

# భయానక వాతావరణం

మొదటిపేజీ తరువాయి..

వాహనాలు బురద, రాళ్ల కింద కూరుకుపోయాయి. ఎటుచూసినా శిథిలాలు, బురద దిబ్బలే కనిపిస్తున్నాయి. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా హెలికాప్టర్ల నుంచి తీసిన ఏరియల్ ఫుటేజీ విపత్తు తీవ్రతను కళ్లకు కడుతోంది. భోటేకోషి, త్రిశూలి నదుల పరీవాహక ప్రాంతాల్లోని అనేక గ్రామాలు వరదల తాకిడికి మట్టిదిబ్బలుగా మారాయి. రసువా, ధాదింగ్ జిల్లాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఆ తర్వాత వరద ప్రవాహం నువాకోట్, చిత్వాన్, గోర్ఖా ప్రాంతాలనూ ముంచెత్తింది. భారీగా వచ్చిన వరద నీటికి ఓ వంతెన కేవలం 30 సెకన్లలోనే కొట్టుకుపోయిన దృశ్యాలు, ప్రవాహ ఉద్ధృతిని స్పష్టం చేస్తున్నాయి. వరద విధ్వంసం కేవలం గ్రామాలకే పరిమితం కాలేదు. కీలకమైన రోడ్లు, వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బేత్రావతి- రసువాగఢి మధ్య ఉన్న దాదాపు 42 కిలోమీటర్ల కీలక రహదారి పూర్తిగా ధ్వంసమైంది. మొత్తం 19 మోటారు వంతెనలు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. దీంతో ప్రభావిత ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రాజధాని కాఠ్‌మాండూను ఇతర ప్రాంతాలతో కలిపే నాగ్‌దుంగా-ముగ్లింగ్ జాతీయ రహదారితో పాటు పలు కీలక మార్గాల్లో రాకపోకలను నిలిపివేశారు.

నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది. నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేందని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాఠ్మాండూకు పంపింది.

ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామనుకున్నా



కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజీ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటిపర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచుచరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రయళం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

### తుమ్మిడిహెట్టి ఆనకట్టపై 2 రాష్ట్రాలతో
# సంప్రదింపులు

మొదటిపేజీ తరువాయి..

అయితే 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు రాష్ట్రం ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని కేంద్రానికి వివరించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో, దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలని భావిస్తున్నట్లు పేర్కొంది. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం నీటి లభ్యత పెరగడంతో పాటు అదనంగా అయ్యే ముంపు కూడా పరిమితంగానే ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. వచ్చే నెల ఒకటో తేదీన జరగనున్న సమావేశంలో ఆనకట్ట నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర, ముంపు సంబంధిత అంశాలపై చర్చ జరగనుంది.



# మిరాలం చెరువుకు మహర్దశ

మొదటిపేజీ తరువాయి..

పనులు , సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన సీఎం, పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 (50.18 శాతం) పైల్స్ పూర్తి కాగా, 62 పైల్ క్యాప్స్‌లో 28 (45.16 శాతం) పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు , ఐలాండ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా చెరువులోకి ఎలాంటి మురుగు నీరు చేరకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించి నీటి నాణ్యతను పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. యువతతో పాటు కుటుంబాలను ఆకట్టుకునేలా మిర్ ఆలం చెరువులో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ కార్యకలాపాలను అందుబాటులోకి తేనున్నారు. పర్యావరణ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చెరువు చుట్టూ ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు , వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు కానున్నాయి. అంతేకాకుండా, చెరువులో ఉన్న ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలుగా, టెంట్లు వేసుకునే గ్లాంపింగ్ స్పాట్లుగా , డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఈవెంట్లకు అనుకూలమైన వేదికలుగా రూపుదిద్దనున్నారు. ఈ నాణ్యమైన సౌకర్యాల కోసం పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి స్థానికులకు ఉపాధి కల్పిస్తారు. సమీపంలోనే ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని సమగ్రంగా అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశర చేశారు. దీనివల్ల జూ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, జలక్రీడలు , కుటుంబ వినోదాన్ని పొందగలుగుతారు. విమానాశ్రయానికి సమీపంలో ఉండే ఈ చారిత్రక ప్రాంతం అభివృద్ధి చెందితే, హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులకు మిర్ ఆలం ట్యాంక్ ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మారనుంది.



# 'రాఖీ'తో 'రాజీ'...!?

మొదటిపేజీ తరువాయి..

సీఎం సతీమణిని సురేఖ, ఆమె భర్త కొండా మురళిలు కలిశారు. మారిన తెలంగాణ రాష్ట్రం రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ తన పదవిని కాపాడుకునేందుకు ఓ రాజీ మార్గాన్ని ఎంచుకున్నారు. రాఖీ పర్వదినాన ముఖ్యమంత్రిని కలిసి నేరుగా రాఖీ కట్టి రాజీ కుదుర్చుకునేందుకు చివరి ప్రయత్నం చేస్తున్నట్లుగా అత్యంత విశ్వసనీయంగా సమాచారం అందింది.

మంత్రి పదవి రక్షణకు రక్షాబంధన్ వేడుక కలిసి వస్తుందని మంత్రి భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ మేరకు వరంగల్ లో ఉన్న ఆమె గురువారం మధ్యాహ్నమే హైదరాబాద్ కు బయలు దేరారు. శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో హైదరాబాద్ లోని సీఎం ఇంటికి వెళ్లి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టేందుకు మంత్రి సురేఖ అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లుగా తెలిసింది. ఆగ్రహంగా ఉన్న క్రమంలో సీఎంను సోదరుడిగా భావిస్తూ రాఖీ కట్టి తన పదవిని కాపాడుకునేందుకు సురేఖ వ్యూహంగా కనిపిస్తోంది. అనుకున్నట్లే శుక్రవారం మంత్రి సురేఖ ముఖ్యమంత్రి కి రాఖీ కడితే, రేవంత్ రెడ్డి ఆగ్రహం చల్లారుతుందా? పాపం పోనీలే అని సురేఖక్కను సీఎం క్షమించి వదిలేస్తారా? రక్షాబంధన్ తో సురేఖ మంత్రి పదవి రక్షించబడుతుందా? ఆమె వ్యూహం ఫలిస్తుందా? వేచి చూడాలి.

## నేడు ఎథిక్స్ కమిటీ సమావేశం

మొదటిపేజీ తరువాయి..

'ఎథిక్స్ కమిటీ పేరిట కాంగ్రెస్ సర్కార్ ప్రతిపక్షంపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బలిచేసేందుకు కుట్రలు చేస్తున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నిండు శాసనసభలో బడివే, పండబెట్టి తొక్కుతా, బట్టలూడదీసి కొడుతా, మా దగ్గర కందలు తిరిగినోళ్లున్నరు.. బొర్ల వేసి కొడ్తం.. అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, 'అరేయ్ తోలుతీస్తా, బయట తిరుగనివ్వను' అని దానం నాగేందర్, 'పదికత్తులు లేస్తే మీ తలలు తెగుతయ్.. కత్తులతో కోలాటమాడుతా' అని మందుల సామేల్ బెదిరింపులు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య సైగలు ఎథిక్స్ కమిటీ కిందికి రావా? అని సూటిగా ప్రశ్నించారు. వారు మాట్లాడిన మాటలు, చేసిన చేష్టల వీడియోలు చూపుతూ ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై చర్చించి చర్యల సిఫార్సుకు ఈ నెల 29న ఎథిక్స్ కమిటీ మీటింగ్ ఏర్పాటుచేసినట్టు నోటీసు వచ్చిందని, అయితే కౌశిక్ వ్యవహారాన్ని సిఫార్సు చేసిన సమయంలో ఎథిక్స్ కమిటీ మనుగడలో లేదని తెలిపారు. అసలు కమిటీ లేనప్పుడు ఆ వ్యవహారాన్ని ఎలా రెఫర్ చేస్తారని ప్రశ్నించారు. దీనిని బట్టి కక్ష సాధింపు చర్యగా అర్థమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కడియం శ్రీహరి అదే ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని కౌశిక్ ఆక్షేపించారని తెలిపారు.

## ఒక ముప్పు తప్పకముందే మరో ముప్పు..

మొదటిపేజీ తరువాయి..

చైనా అధికారులు గుర్తించారు. టిబెట్‌లో ప్రారంభమయ్యే చోచెన్ ఖోలా, పురేపు సాంగ్పో నదులు సంగమించిన ప్రాంతానికి సమీపంలో ఏర్పడిన ఈ సరస్సులో గురువారం ఉదయానికి సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రానున్న మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. దీంతో సరస్సు గండిపడి దిగువ ప్రాంతాల్లో మరోసారి భారీ వరదలు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పరిస్థితిని చైనా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, సరస్సుకు గండి పడితే చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై చర్చిస్తున్నారు. చైనా నుంచి సమాచారం అందినట్లు నేపాల్ జల విజ్ఞాన, వాతావరణ విభాగం వెల్లడించింది. భోటేకోషి, త్రిశూలి నదుల పరివాహక ప్రాంత ప్రజలు నదీ తీరాలకు దూరంగా ఉండాలని, తదుపరి సమాచారం వచ్చే వరకు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని అధికారులు సూచించారు. సెర్చ్, రెస్క్యూ బృందాలు, ప్రయాణికులు, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## జన్‌ధన్ డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లు

మొదటిపేజీ తరువాయి..

నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్-ఆధార్- మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి. 2014 ఆగస్టు 28న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస నిల్వ లేకుండానే నిర్వహించుకోవచ్చు.. కానీ చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి నిబంధన విధించారు.

## భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

బెంగళూరు,ఆగస్ట్27(అడుగు న్యూస్): వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది. కోడలు అత్తమామలకు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప, బలవంతం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కేవలం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని కోర్టు పేర్కొంది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారం ఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది.

అడుగు

# ఘనంగా రాఖీ వేడుకలు

మహబూబాబాద్, ఆగస్టు 27 (అడుగు న్యూస్): విశ్వహిందూ పరిషత్--మాతృశక్తి ఆధ్వర్యంలో గురువారం మానుకోటలో రాఖీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాతృశక్తి జిల్లా సంయోజక్ సింగం మల్లేశ్వరి, పరకాల కళావతి ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో రాఖీలు కట్టారు. సబ్‌జైలు, కలెక్టరేట్‌లోని అధికారులు, సిబ్బంది, జర్నలిస్టులు, పోలీసు సిబ్బంది, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు, మోడల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటారు. రక్షాబంధన్ పర్వదినం అన్ని బంధాలకు విలువను చాటే సనాతన సంప్రదాయమని వారు తెలిపారు. ప్రతి ఇంటా రక్షాబంధన్ వేడుకలను వైభవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాదుల అరుణ, పరకాల నిర్మల, పరకాల లక్ష్మి, పెద్దబోయిన ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# మొక్కే జీవన కానుక...

## రాఖీతో ప్రకృతికి బంధం!

పాలకుర్తి, ఆగస్టు 27 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యానిలయం విద్యార్థినీ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వినూత్న కార్యక్రమం నిర్వహించారు.



రాజీవ్ చౌరస్తా నుంచి ప్రారంభమైన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ షాపులకు వెళ్లి చెట్ల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, నీరు--విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. "ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం.. చెట్లను కాపాడుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అంటూ నినాదాలు చేస్తూ షాపు యజమానులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మండలంలోని కుటుంబాలకు ఒక్కో మొక్కను అందించి, వాటిని నాటి సంరక్షించాలని కోరారు. మొక్కను బహుమతిగా కాకుండా భావితరాలకు అందించే "జీవన కానుక"గా భావించాలని సూచించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రజలకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటడంతో పాటు "సోదర బంధంతో పాటు ప్రకృతితోనూ మన బంధాన్ని బలపరుచుకుందాం" అనే సందేశాన్ని అందించారు. విద్యార్థుల సామాజిక బాధ్యత, పర్యావరణ ప్రేమను స్థానికులు అభినందించారు.

# చెట్లకు రాఖీలు.. ప్రకృతికి రక్షణ!

## ముఖరా కే మహిళల వినూత్న సందేశం

ఇచ్చోడ, ఆగస్టు 27 (అడుగు న్యూస్): రక్షాబంధన్ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా, బోథ్ నియోజకవర్గం, ఇచ్చోడ మండలంలో గల ఆదర్శ గ్రామం ముఖరా కే గ్రామ





మహిళలు చెట్లకు రాఖీలు కట్టి పర్యావరణ పరిరక్షణకు వినూత్న సందేశాన్ని ఇచ్చారు. అన్నదమ్ములకు రాఖీలు కట్టడంతో పాటు, తమకు జీవనాధారంగా నిలుస్తున్న చెట్లను సోదరులుగా భావిస్తూ వాటికి రాఖీలు కట్టి రక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా ఎదిగి గ్రామానికి పచ్చని అందాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు గ్రామానికి హరిత స్వాగతం పలుకుతున్నాయి. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. "మొక్కలు మనకు స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణం, పర్యావరణాన్ని అందిస్తున్నాయి. పిల్లల కోసం ఆస్తులు సంపాదించడం ఎంత ముఖ్యమో, వారు ఆరోగ్యంగా జీవించేందుకు మంచి పర్యావరణాన్ని అందించడం అంతకంటే ముఖ్యం" అని అన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, మనం ప్రకృతికి రక్షణగా నిలిస్తే ప్రకృతి మనకు రక్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇకపై ప్రతి రక్షాబంధన్‌కు "ఒక రాఖీ ప్రకృతికి అంకితం" చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

### మేమంతా క్షేమంగా ఉన్నాం: సతీష్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్27(అడుగు న్యూస్): భారీ వరదలతో నేపాల్ పరిసర ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. ఈ వరదల వల్ల వంద మందికిపైగా మరణించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక వందలాది మంది గల్లంతయ్యారు. వారిలో విదేశీయులు కూడా ఉన్నారు. ఆ జాబితాలో భారతీయులు కూడా ఉన్నట్లు వార్తా కథనాలు వెలువడుతున్నాయి. దీంతో భారత్‌లోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర కలత చెందుతున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటికే రంగంలోకి దిగి వారి ఆచూకీ కోసం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో టిబెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి స్పందించారు.

# విద్యార్థుల భవిష్యత్తులో టీచర్లదే కీలక పాత్ర

పాలకుర్తి, ఆగస్టు 27 (అడుగు న్యూస్): విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. గురువారం పాలకుర్తి మండలంలోని పీఎం శ్రీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ



చేసిన ఆయన తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి హిందీ, ఇంగ్లీష్, గణితం, సాంఘిక శాస్త్రాల్లో వారి అభ్యాస సామర్థ్యాన్ని పరీక్షించారు. బ్లాక్‌బోర్డుపై గణితం, సాంఘిక శాస్త్ర అంశాలను స్వయంగా బోధించారు. యూనిఫాం, నోట్‌బుక్స్, పాఠ్యాంశాల పూర్తి స్థాయి, పాఠశాల వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు చెస్, వాలీబాల్, ఖోఖో, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడల్లో శిక్షణ అందించాలని పీఈటీని ఆదేశించారు. పాత బెంచీలను మరమ్మతు చేసి అవసరమైన పాఠశాలలకు తరలించాలని, ప్రత్యేక గదిలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సూచించారు. దెబ్బతిన్న కిటికీలు, ఫ్యాన్లను మరమ్మతు చేయడంతో పాటు తరగతి గదులకు సున్నం వేయించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక



తరగతులు నిర్వహించి, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్లు, కోడింగ్ వంటి ఆధునిక సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో ఎంపీడీఓ వేదవతి, హెచ్‌ఎం శోభారాణి, సర్పంచ్ కె. విజయ, ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు వి. హనుమంతరావు, కామారపు సునీల్, కమ్మగాని శ్రీకాంత్, నాయకులు మారం శ్రీనివాస్, కమ్మగాని నాగన్న, ఆకుల నాగరాజు, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసులపై అవగాహన సదస్సు

ఐనవోలు, ఆగస్టు 27 (అడుగు న్యూస్): వరంగల్ జిల్లా, ఐనవోలు మండలంలోని సింగారం గ్రామంలో ఎస్ఐఆర్ నోటీసుల ప్రక్రియపై గ్రామసభలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జీపీఓ అనిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై ప్రజలకు



వివరించారు. తమ ఓటు వివరాలను పరిశీలించుకోవడంతో పాటు జాబితాలో తొలగించబడిన ఓట్లు, డౌట్‌లో ఉన్న ఓట్లు, ఇతర తప్పులుంటే గుర్తించి సరిచేసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ నోటీసుల ప్రక్రియ, వాటి ప్రాముఖ్యత, ఓటర్ల వివరాల పరిశీలన, అవసరమైన సవరణలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు జాబితాలో తమ వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జీపీఓ అనిల్ సూచించారు.

# తీజ్ పండుగ

పాలకుర్తి, ఆగస్టు 27 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, పెద్ద తండా కే గ్రామంలో గిరిజనులు తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన తీజ్ పండుగ ముగింపు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు పోగు శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. మార్కెట్ చైర్‌పర్సన్ లావుడియా మంజుల భాస్కర్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గ్రామ ప్రజలకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### మైనింగ్ ఏడీ జయరాజు ఇళ్లపై ఏసీబీ దాడులు

హైదరాబాద్,ఆగస్ట్27(అడుగు న్యూస్): భాగ్యనగరంలో మరోసారి ఏసీబీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు ఇళ్లలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గురువారం తెల్లవారుజాము నుంచే సోదాలు మొదలయ్యాయి. భూపాలపల్లితో పాటు హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు ప్రాంతాల్లోని 8 చోట్ల అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో దాడులు కొనసాగుతున్నాయి. సోదాల్లో జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదు, బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్, ల్యాండ్ డాక్యుమెంట్లను గుర్తించి.. పరిశీలిస్తున్నారు. బ్యాంకులో రూ.60 లక్షల నగదు ఏసీబీ అధికారులు గుర్తించారు. అలాగే రెండు కార్లు, రెండు బైక్‌లు, జనగామలో ఐదు ఎకరాల భూమి ఏసీబీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. సోదాలపై ఏబీసీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్ మాట్లాడుతూ.. భూగర్భ జల గనుల శాఖ ఏడీ జయరాజు నివాసంలో పాటు మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఉదయం నుంచి జరుగుతున్న సోదాల్లో నలభై తులాల బంగారాన్ని గుర్తించామన్నారు. జయరాజ్ ఇంట్లో లక్షన్నర నగదుతో పాటు ఆయన బ్యాంకు ఖాతాలో నగదును కూడా గుర్తించామని చెప్పారు. జనగామలో జయరాజుకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని.. ఆయనపై ఏసీబీకి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. హైదరాబాద్‌లోనే నాలుగు చోట్ల సోదాలు కొనసాగుతున్నాయని సాయి మనోహర్ తెలిపారు. తాండూరు, వరంగల్‌లోని జయరాజ్ సన్నిహితులు, బంధువుల ఇళ్లల్లో కూడా సోదాలు జరుగుతున్నాయని అన్నారు. బోడుప్పల్‌లో జీ ప్లస్ వన్ బిల్డింగ్‌తో పాటు రెండు కార్లు, రెండు బైక్‌లను కూడా గుర్తించామన్నారు. సాయంత్రం వరకు సోదాలు కొనసాగుతాయని.. సోదాల అనంతరం ఆయన అక్రమాస్తులపై క్లారిటీ వస్తుందని వెల్లడించారు. జయరాజ్ ఇటీవలే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు.

# ఖేలో ఇండియా సంవాద్

మొదటిపేజీ తరువాయి..

యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తాయన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి యువశక్తితో పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిధ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# ఆర్ఎస్ఎస్ నేత సూచనతో హరీష్ సీక్రెట్ ఆపరేషన్!

### మెదక్‌లో ఎమ్మెల్యేలతో హరీష్ భేటీ అయ్యారు!
### టీఆర్ఎస్ చీఫ్ కవిత సంచలన ఆరోపణలు!

హైదరాబాద్,ఆగస్ట్27(అడుగు న్యూస్): తెలంగాణలో అవినీతిని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కలిసి వ్యవస్థీకృతం చేశారని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. అందరూ కలిసి ఆంధ్రప్రాంత కంపెనీలు, నేతల కోసం పని చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలో ఎవరు ఉన్నాసరే ఆంధ్ర కంపెనీలు, నేతల మాటే చెల్లుబాటు అవుతుందని విమర్శించారు. అవినీతి చేస్తూనే బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే ప్రక్రియ కూడా కొనసాగుతోందని అన్నారు. దీనికి హరీష్‌రావు లీడ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మధ్య మెదక్‌లో ఎమ్మెల్యేతో హరీష్‌రావు సీక్రెట్‌గా మీట్ అయ్యారని, అక్కడ ఏమి మాట్లాడారో తనకు తెలుసునని అన్నారు. పాలలో మిరియాలు, పసుపు కలుపుకొని



తాగే ఆర్ఎస్ఎస్ నేత కనుసన్నల్లోనే హరీష్‌రావు పని చేస్తున్నారని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన వచ్చే ముందు హరీష్‌రావు ఇంటికి పసుపు, మిరియాలు కలిపిన పాలు వెళ్తాయని చెప్పారు. అంటే ఢిల్లీకి చెందిన ఆ వ్యక్తి ఇక్కడకి వస్తున్నట్టు ఆ పాలు సిగ్నల్ అని తెలిపారు. అలా వచ్చిన తర్వాత హరీష్ రావు అన్ని కార్యక్రమాలు రద్దు చేసుకొని రాజ్‌పుష్ప ఓపెన్ స్కైవిల్లాకు వెళ్లారని బాంబు పేల్చారు. ఆ వ్యక్తి సూచనలతోనే హరీష్ పని చేసతున్నారని మండిపడ్డారు. ఈ మధ్య మెదక్‌లో ఎమ్మెల్యేలతో సమావేశమైన హరీష్‌రావు, భవిష్యత్ మనదేనంటూ చెప్పారని కవిత తెలిపారు. ఈ విషయాన్ని ఆ మీటింగ్‌లో ఉన్న ఒక ఎమ్మెల్యే తనకు సమాచారం అందించారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ మాదిరిగానే కేసీఆర్ కూడా పెద్ద లీడర్ అని అయితే ఆయన తర్వాత తానే లీడ్ చేస్తానని, తర్వాత జరగాల్సింది బీజేపీ చూసుకుంటుందని చెప్పినట్టు తనకు తెలుసునన్నారు కవిత. ఇదంతా బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు జరుగుతున్న ప్రక్రియలో భాగమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఏమవుతుందో తనకు సంబంధం లేదని అయితే అంతా కలిసి అవినీతిని వ్యవస్థీకృతం చేస్తున్నారని, ఆంధ్రవ్యాపారులను పెంచి పోషిస్తున్నారని మండిపడ్డారు. కేసులు అంటూ హడావిడి చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు సైలెంట్ అయ్యిందని ప్రశ్నించారు. హరీష్‌రావు నిందితుడుగా ఉన్న ఏ కేసూ ముందుకు కదలడం లేదని ఆరోపించారు. వారి నిజం స్వరూపం చెప్పడానికే ఇదంతా చెప్పాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ వాదం వినిపించాలి అంటే కచ్చితంగా నిజమైన తెలంగాణ నేతలు, ప్రజల కోసం నిలబడే వారిని గెలిపించుకోవాలని ప్రజలకు కవిత విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్‌లో 31వ తేదీన ఏర్పాటు చేసే సభకు తరలి రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాఖీ పౌర్ణమి రోజున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అందుబాటులో లేకపోవడంపై కూడా కవిత మండిపడ్డారు. గతేడాది పండగ సందర్భంగా సిటీలో లేకుండా రాఖీ కట్టించుకోలేదని, ఇప్పుడు ఏకంగా దేశంలోనే లేకుండా వెళ్లిపోయారని అసహనం వ్యక్తం చేశారు. పవిత్రమైన రాఖీ పండగ రోజు ఇలా లేకపోవడం తనను బాగా హర్ట్ చేసిందని కవిత పేర్కొన్నారు. ఆత్మగౌరవం దెబ్బతిందని తెలిపారు. రాజకీయలతో ముడిపెట్టడం సరికాదని సూచించారు.




# తమ్ముడికి జీవితాన్నే బహుమతిగా ఇచ్చిన అక్క!?


రాఖీల పున్నం పండగను అన్నా శెల్లెల్లు, అక్కాతమ్ముళ్ల మద్దెల పేమానురాగాలకు, రచ్చణకు పతీకగా జరుపుకుంటరు. రాఖీ అంటే రచ్చణ కవచం. రచ్చా సూత్రం. గా అన్నాతమ్ముల్లకు ఆపదలు రాకుండా, గవాల్లు ఆయురారోగ్యాలతో కలకాలం ఉండాలని అక్కా శెల్లెల్లు మణికట్టుకు రాఖీ కడతరు. అక్కా శెల్లెల్లకు




జీవితకాలం భరోసగ, అండగా ఉంటమని, గీ పండుగనాడు పతిన శేత్తరు. గిసొంటి గీ రోజున గా అక్క తన తమ్మునికి జీవితాన్నే రివర్స్ గిప్టుగ ఇచ్చింది. గదేందో సూద్దాం పదండ్రి. ఢిల్లీకి శెందిన జితేంద్రకుమార్ కు కిడ్నీల సమస్య ఒచ్చింది. రొండేండ్లుగ వారానికి 3 సార్ల డయాలసిస్ శేత్తాండ్రు. గాయినకు బీనా కుమారి అని ఒక అక్క ఉంది. గీ తమ్ముని పానం పోతాంటె సూడలేక, తన ఒక కిడ్నీని ఇత్తనంది. పరీచ్చలు శేసి పనికి వత్తదని డాక్టర్లన్నరు. యెంటనే గా కిడ్నీ మార్చిండ్రు. గిప్పుడు గా తమ్ముడు, గీ అక్కా కోలుకుంటాండ్రు. అక్కంటే గామే పోండ్రి.

# కార్గో పార్సిళ్లకు వేలం..

హన్మకొండ, ఆగస్టు 27 (అడుగు న్యూస్): వరంగల్ ఆర్టీసీ కార్గో పార్సిల్ కార్యాలయంలో వినియోగదారులు తీసుకెళ్లకుండా మిగిలిపోయిన వస్తువులను ఈ నెల 29న వేలం వేయనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వరంగల్‌కు బుకింగ్ చేసినప్పటికీ, నిర్ణీత కాలపరిమితిలో వినియోగదారులు తీసుకెళ్లని పార్సిళ్లను వేలం వేస్తున్నట్లు చెప్పారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు హనుమకొండ డిపోలో వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని డిపో మేనేజర్ కోరారు.



# శ్రీకృష్ణాష్టమి విజయవంతం చేద్దాం

దేవరుప్పుల, ఆగస్టు 27 (అడుగు న్యూస్): సెప్టెంబర్ 4న జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి శ్రీకృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్, ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ బనుక శివరాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. దేవరుప్పుల, పాలకుర్తి మండల కేంద్రాల్లో సలేంద్ర శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథులు బనకా సుందర్ రాజ్ యాదవ్, బనుక శివరాజ్ యాదవ్ పాల్గొన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఈశ్వరమ్మ తదితరులు హాజరవుతారని తెలిపారు. కాసాని రమేష్ యాదవ్, రజాక్ యాదవ్, దండబోయిన నందు యాదవ్, చందు యాదవ్, పాండు కృష్ణ యాదవ్, చిలువేరు కృష్ణమూర్తి యాదవ్, సిద్ధి లింగం యాదవ్, కుమార్ యాదవ్, వర్రె వెంకన్న యాదవ్, బక్క పుల్లయ్య యాదవ్, లింగయ్య యాదవ్, బేతి కుమార్, జిట్టబోయిన రమ్య ప్రశాంత్, సలేంద్ర సోమన్న, బెల్లి యుగంధర్, చిలువేరు సంపత్, కొంగరి ఐలోని, షీలా లింగయ్య, జక్కుల రాజు, తోడుసు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## వివో భవన నిర్మాణానికి శంకుస్థాపన

పాలకుర్తి, ఆగస్టు 27 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండల కేంద్రంలో వివో భవన నిర్మాణానికి పాలకుర్తి సర్పంచ్ కమ్మగాని విజయనాగన్న గౌడ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గాదెపాక కిరణ్, వార్డు సభ్యులు విరమనేని హనుమంతరావు, కమ్మగాని సుధాకర్, కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, కత్తి దస్తగిరి, ఏలమకంటి స్వప్న సతీష్, వివోలు, మహిళా సంఘాల సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు హాజరై మహిళా సంఘాలకు భవిష్యత్‌లో మరింత ఉపయోగకరంగా ఉండేలా భవనాన్ని నిర్మించాలని నాయకులు ఆకాంక్షించారు.



# పీడీఎస్ బియ్యం పట్టివేత

పాలకుర్తి, ఆగస్టు 27 (అడుగు న్యూస్): పాలకుర్తి పోలీసులు గురువారం తెల్లవారుజామున నిర్వహించిన వాహన తనిఖీల్లో రెండు వాహనాల్లో తరలిస్తున్న సుమారు 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. TS07UN5612 అశోక్ లేలాండ్ వాహనంలో 30 క్వింటాళ్లు, TS08UB9032లో 10 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్లు మాలోతు మోహన్ (రాజుపేట), భూక్య నామా (తుర్కపల్లి) గ్రామస్థుల నుంచి బియ్యం సేకరించి తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పాలకుర్తి ఎస్ఐ, సిబ్బంది తదుపరి విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

# ఆటలు

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..



## రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం

### శ్రీలంక ఆటగాడు సోనాల్ దినుషా అజేయ శతకం

### శ్రీలంకతో డ్రాగా ముగిసిన రెండో టెస్ట్ .. టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం


శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియాకు అనూహ్య ఫలితం ఎదురైంది. విజయం ఖాయమనుకున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. సోనాల్ దినుషా(264 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 133 నాటౌట్) అజేయ శతకంతో టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసాడు. మరోవైపు ఓటమి తప్పదనుకున్న మ్యాచ్‌లో సోనాల్ దినుషా, టెయిలెండర్ల అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో శ్రీలంక డ్రాతో గట్టెక్కింది. దాంతో ఈ రెండు టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది. 229/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను 154 ఓవర్లలో 429/9 స్కోర్ వద్ద డ్రా చేసింది. రెండో ఇన్నింగ్స్ ఆడేందుకు తగిన ఓవర్లు లేకపోవడంతో.. శుభ్‌మన్ గిల్ షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. సోనాల్ దినుషా అజేయ శతకంతో పాటు పసింధు సూర్యబండార(173 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 92), కామిందు మెండీస్(92 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 55), కేశర నువాంత(150 బంతుల్లో 4 ఫోర్లతో 46) విలువైన పరుగులు చేశారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(3/121), రవీంద్ర జడేజా(3/94) మూడేసి వికెట్లు తీయగా.. ప్రసిధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్, సారాన్ష్



జైన్ తలో వికెట్ తీసారు. తొలి సెషన్‌లోనే ఫలితం తేలుతుందని భారత్ భావించగా.. సోనాల్ దినుషా, కేశర నువాంత అడ్డుగోడగా నిలిచారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచారు. 32 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఈ ఇద్దరూ.. తొలి సెషన్‌లో 100 పరుగులు జోడించారు. దాంతో శ్రీలంక 329/6 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో కేశర నువాంత ఔటవ్వడంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే ప్రభాత్ జయసూర్య కూడా ఔటవ్వడంతో భారత శిబిరంలో ఆశలు చిగురించాయి. కానీ లాహిరు కుమారతో కలిసి సోనాల్ దినుషా ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. జిడ్డుగా ఆడిన ఈ జోడీ.. భారత బౌలర్ల సహనాన్ని దెబ్బతీసింది. 383/8 స్కోర్‌తో శ్రీలంక టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఇదే ప్రదర్శనను కొనసాగించిన శ్రీలంక 400 పరుగుల మార్క్‌ను అందుకుంది. 196 బంతుల్లో దినూషా సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 90 బంతులాడిన లాహిరు కుమారను జడేజా ఔట్ చేసినా ఫలితం లేకపోయింది. అసితా ఫెర్నాండో(0 నాటౌట్) కలిసి దినుషా మరో 10 ఓవర్లు ఆడగా.. శ్రీలంక డిక్లేర్ చేసింది. శుభ్‌మన్ గిల్ వెంటనే షేక్ హ్యాండ్ ఇచ్చి డ్రాకు అంగీకరించాడు. వర్షం అంతరాయం, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారడం, భారత ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం లోపించడం.. గిల్ సేన విజయాన్ని అడ్డుకున్నాయి.

## ఐసీసీపై మండిపడ్డ స్టీవ్ వా

వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. ఐసీసీ తీసుకున్న ఈ ఫార్మాట్ మార్పు నిర్ణయంపై ఇప్పటికే అసోసియేట్ దేశాలైన స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆగస్టులో ఈ రెండు బోర్డులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఐసీసీ నిర్ణయం అసోసియేట్ దేశాల క్రికెట్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని, ఇటీవల కాలంలో ఆటను విస్తరించడానికి సాధించిన పురోగతిని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. "టోర్నమెంట్ ప్రారంభానికి 18 నెలల కంటే తక్కువ సమయం ఉన్న తరుణంలో, పురుషుల 50 ఓవర్ల ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియ, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఐసీసీ భారీ మార్పులు చేయడం తీవ్ర నిరాశ కలిగించింది. క్రికెట్ తన పరిధిని విస్తరించుకోవాలని, కొత్త ప్రేక్షకులను ఆకర్షించాలని చూస్తున్న తరుణంలో.. ఎదుగుతున్న చిన్న దేశాలకు అవకాశాలు తగ్గించడం అంతర్జాతీయ క్రీడా ప్రపంచానికి చాలా తప్పుడు సంకేతాన్ని పంపుతుంది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.



## అఫ్ఘాన్‌తో టి20 సిరీస్ కు అభిషేక్ శర్మపై వేటు?

భారత పురుషుల క్రికెట్ జట్టు సెప్టెంబర్ 2026లో అఫ్ఘానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్ కోసం అఫ్ఘానిస్తాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన తమ బలమైన జట్టును అధికారికంగా ప్రకటించింది. ఇందులో స్టార్ ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి జట్టులోకి రావడం విశేషం. నవీన్ చివరిసారిగా డిసెంబర్ 2024లో అఫ్ఘానిస్తాన్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి వచ్చే నెలలో జరగనున్న ఈ సిరీస్ కోసం భారత జట్టును త్వరలోనే ప్రకటించనుంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని ప్రసిద్ధ అరుణ్ జైట్లీ స్టేడియంలో సెప్టెంబర్ 13, 15 మరియు 17 తేదీల్లో జరగనుంది. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రమాదకరమైన జట్లను సైతం ఓడించే సత్తా ఉన్న అఫ్ఘానిస్తాన్‌ను టీమిండియా ఏమాత్రం తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. మరోవైపు, ఈ సిరీస్ భారత ఆటగాళ్లకు రాబోయే ఏషియన్ గేమ్స్ 2026 సన్నాహకాల కోసం అత్యంత కీలకమైన వేదికగా ఉపయోగపడనుంది. భారత్ గత జూలైలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో ఆడిన




టీ20 సిరీస్‌లలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక తీవ్రంగా నిరాశపరిచింది. దీంతో సెలెక్టర్లు అఫ్ఘానిస్తాన్‌తో పోరు కోసం పటిష్టమైన సమతూకంతో కూడిన జట్టును ఎంపిక చేయాలని భావిస్తున్నారు. గతంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ ఇటీవలి కాలంలో తీవ్ర ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. జింబాబ్వే పర్యటనతో పాటు, ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ బ్యాట్‌తో రాణించడంలో విఫలమయ్యాడు. దీంతో అఫ్ఘానిస్తాన్ సిరీస్ నుంచి అతడిని తప్పించినా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలుస్తోంది. అభిషేక్ శర్మ స్థానంలో కేరళకు చెందిన స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్న శాంసన్‌ను జింబాబ్వే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజా సిరీస్‌తో అతను మళ్లీ మెయిన్ స్క్వాడ్‌లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. భారత్ తరఫున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌కు పునరాగమనం చేయడం ఖాయం. అయితే సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 2022 తర్వాత భువనేశ్వర్ భారత్ తరఫున మళ్లీ మ్యాచ్ ఆడలేదు. యితే ఐపీఎల్ 2026లో ఆర్సీబీ తరఫున అద్భుత స్వింగ్ బౌలింగ్‌తో మెరిసిన భువీ, ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లోనూ నిలకడగా వికెట్లు తీస్తూ వార్తల్లో నిలుస్తున్నాడు. దీంతో అతడిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. త్వరలోనే బీసీసీఐ పూర్తి జట్టు వివరాలను ప్రకటించే అవకాశం ఉంది.

# సినిమా

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..




## సినిమా విజయం చిత్ర పరిశ్రమలో అందరిది

### ఇరుడముడికి చిరంజీవి ప్రత్యేక అభినందనలు

ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది 'ఇరుముడి'. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ఈ హిట్ సినిమాపై రివ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పెట్టిన క్యాప్షన్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒక సినిమా విజయం సాధిస్తే పరిశ్రమలో అందరికీ పండగే అని చెప్పిన చిరు.. 'ఈ పరిశ్రమ అందరిది.. ఏ కొందరిదో కాదు. మనం బతకాలి.. ఇతరులనూ బతికించాలి' అని పేర్కొన్నారు. ఇక 'ఇరుముడి' చిత్రబృందానికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన సోదరుడు రవితేజకు అభినందనలు. సినిమాను మొదటి నుంచి చివరి వరకు పూర్తిగా ఆస్వాదించా. రవితేజ అద్భుతంగా నటించాడు. ఈ సినిమా బాధ్యతను దర్శకుడు శివ నిర్వాణ తన భుజాలపై వేసుకుని గొప్పగా తీర్చిదిద్దారు. సున్నితమైన భావోద్వేగాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. బాలనటి నక్షత్రకు గొప్ప భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నా. 'ఇరుముడి'లో భాగమైన నటీనటులకు, టెక్నీషియన్స్‌కు, నిర్మాతలకు ప్రత్యేక అభినందనలు' అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ చిత్ర విజయం అర్థమైనదని పేర్కొన్నారు. చిరు పోస్ట్‌పై రవితేజ స్పందించారు. 'అన్నయ్యా థాంక్యూ..' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించి కృతజ్ఞతలు చెప్పారు. విడుదలైన నాటి నుంచి థియేటర్స్ హౌస్ ఫుల్‌తో కళకళలాడుతుండగా, ఆరో రోజు కూడా అదే జోరు కొనసాగింది. కొన్ని థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న సినిమాను తీసేసి 'ఇరుముడి' వేయాలంటూ పలువురు ప్రేక్షకులు ఆందోళన చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సీట్లు సరిపోక కుర్చీలు తెచ్చుకుంటున్నారు. కొన్ని హాళ్లలో ఏకంగా భజనలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ

### రంగస్థలంను మించి ఉంటుందంటూ ప్రచారం

టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.




## నుటడు నారాయణరావు కన్నుమూత

ప్రముఖ నటుడు జీవీ నారాయణ రావు (73) కన్నుమూశారు. ఆయన ఇకలేరనే విషాదకర వార్తను నటి కరాటే కల్యాణి సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. నారాయణ రావు 100కు పైగా చిత్రాల్లో నటించారు. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో నటుడిగా పరిచయమైన ఆయన.. తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న నారాయణరావు.. రజనీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడే. 'అంతులేని కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర్', హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు,



పెళ్ళి నీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణరావు మృతిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంతాపం తెలిపింది. నారాయణరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ప్రస్తుతం ఇద్దరూ విదేశాల్లో ఉంటున్నారు. కృష్ణాజిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణ రావు బాల్యం, విద్యాభ్యాసం గుంతకల్లులో సాగింది. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఎ.ఆర్.కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారు. చదువుకునే రోజులలో మహమ్మద్ బీన్ తుగ్లక్, ప్రతాపరుద్రీయం, మంచుతెర తదితర నాటకాలలో నటించారు. దివంగత సినిమా నటులు కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాల తదితరులు నారాయణరావుకు రంగస్థల మిత్రులు. సినిమాలతో పాటు పలు టి.వి.సీరియళ్లలోనూ నారాయణ రావు నటించారు.

## రణబాలి రిలీజ్ అక్టోబర్16కు మార్పు




రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు.తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. 'రణబాలి'ని సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. 19వ శతాబ్దం నేపథ్యంలో కథ సాగుతుంది. ముఖ్యంగా బ్రిటీష్ పాలన కొనసాగుతున్న సమయంలో 1854 నుంచి 1878 మధ్య జరిగిన చారిత్రక పరిణామాలను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. విజయ్ దేవరకొండ ఈ సినిమాలో ఇంతకుముందెన్నడూ చూడని విధమైన పాత్రలో కనిపించనున్నారని టాక్. పీరియాడిక్ ప్రపంచం, భారీ యాక్షన్ సన్నివేశాలు, అప్పటి కాలానికి సంబంధించిన సెట్స్, విజువల్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది.

Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005